ధర్మమే గెలిచింది

- ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరుపై సంబురాలు
- పటాకులు కాల్చిన బీఆర్ఎస్ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: టపాకాయలు కాలుస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 27 : ఎమ్మెల్సీ కల్వకుంట కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుందన్నారు. కవితపై అక్రమ కేసులు కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగమే అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, శ్రీనివాస్, రాజ్, మాజీ కౌన్సిలర్లు సోహెల్, చంద్రకళ, నాయకులు ప్రభురెడ్డి, మధు, జూబేర్, ఫాజిల్, జగదీశ్వర్, రవి, కిరణ్, మహేశ్‌యాదవ్, రాజు అమీర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కుట్రలో భాగమే..

అల్లాదుర్గం, ఆగస్టు 27 : ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు ఆవుల అంజి యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ కుట్రలో భాగంగా, కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే కవితను అక్రమంగా అరెస్టు చేశారన్నారు.

బెయిల్‌పై హర్షం

చిలిపిచెడ్, ఆగస్టు 27 : లిక్కర్ స్కాంలో అక్రమంగా అరెస్టు చేసిన కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.

బెయిల్ మంజూరు హర్షణీయం

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 27 : ఢిల్లీ లిక్కర్ స్కామ్‌తో సంబంధం ఉందని కేం ద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎమ్మెల్సీ కవితను అక్రమంగా కేసులో ఇరికించడం దురదృష్టకరమని బీఆర్ఎస్ మెదక్ పట్టణ కన్వీనర్ మామిళ్ల అంజనేయులు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కేసులో కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయ డం హర్షణీయమన్నారు.

సుప్రీం తీర్పునకు స్వాగతం

శివ్వంపేట, ఆగస్టు 27 : బీజేపీ నాయకులు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను లొంగదీసుకోవాలనే ఉద్దేశంతో కవితను అరెస్టు చేశారని గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ చంద్రాగౌడ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. సాక్షిగా ఉన్న కవిత ముద్దాయి ఎలా అయిందని, ఇన్ని రోజులుగా ఆమె నుంచి ఎంత డబ్బు రికవరీ చేశారని సుప్రీం కోర్టు నిలదీయగా సమాధానం లేకపోవ డంతో, ఫాల్స్ కేసుల నుంచి చివరకు సుప్రీం తీర్పుతో ధర్మమే గెలిచిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు.

సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం..

పాపన్నపేట, ఆగస్టు 27 : సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కుమ్మరి జగన్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కేసులో ఏ మాత్రం బలం లేకుండా సీబీఐ, ఈడీ దాదాపు 5 నెలలుగా కవితను తప్పుడు కేసులో ఇరికించి జైలు పాలు చేయడం శోచనీయమన్నారు.

న్యాయమే గెలిచింది

మెదక్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): రాజకీయ ప్రేరితమైన కేసులో న్యాయమే గెలిచిందని ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఎలాంటి ఆధారాలు లేకున్నా ఐదు నెలలు జైలులో ఉంచడం చాలా హేమమైన చర్య అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల మద్దతుతో కేసులో విజ యం సాధించామని బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

ఇంటర్ నోడల్ జిల్లా అధికారిగా మాధవి

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 27 : ఇంటర్ నోడల్ జిల్లా అధికారిగా ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ మాధవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పని చేసిన సత్యనారాయణ ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నందున జిల్లాలో సీనియర్ ప్రిన్సిపాల్‌గా ఉన్న మాధవిని ఇంటర్ నోడల్ అధికారిగా ఉన్నత విద్యాశాఖ నియమించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ విద్య బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తెలంగాణ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్‌బాబు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉస్మాన్, వేణుమాధవ్ ఆమెను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ఎస్సై విరాళం

విరాళం అందజేస్తున్న ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట, ఆగస్టు 27 : నిజాంపేటలోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్ కోసం దాతలు చేయూతనిస్తున్నారు. మంగళవారం నిజాంపేట ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి రూ.15,116 విరాళాన్ని ఆరోగ్యమే మహాభాగ్యం టీమ్ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్యమే మహాభాగ్యం టీం సభ్యులు సిద్ధిరాం రెడ్డి, స్వామి, చంద్రశేఖర్, తిరుపతి, ప్రసాద్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మహంకాళి ఆలయ ఉత్సవాలకు ఆహ్వానం

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వానపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చేగుంట, ఆగస్టు 27 : చేగుంటలో మహంకాళి ఆలయ ఉత్సవాలకు రావాలని కోరుతూ దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు మనోహర్‌రావుకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రం అందజేశారు. మంగళవారం దుబ్బాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిళ్లకు దూరంగా ఉండాలి

సమావేశంలో మాట్లాడుతున్న సైకాలజిస్టు దుర్గ

రామాయంపేట, ఆగస్టు 27 : మానసిక ఒత్తిళ్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని సైకాలజిస్టు దుర్గ పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు మత్తు పదార్థాలు, సెల్‌ఫోన్ వాడకం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఉన్నత లక్ష్యాలతో చదివి కళాశాల, తల్లిదండ్రులు, గురువులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ హిమజ్యోతి, బాల ప్రకాశ్, సురేశ్‌కుమార్, బాలాగౌడ్, కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

ఎప్పటికైనా న్యాయమే గెలుస్తది

చేగుంట : మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలరాం బాబు

చేగుంట, ఆగస్టు 27 : ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలరాం బాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవిత ఢిల్లీ మద్యం కేసులో అక్రమంగా అరెస్టు చేసి, సీబీఐ విచారణ పేరున జైలులో పెట్టిందని అన్నారు. అది రాజకీయ కోసం చేసిన అరెస్టు మాత్రమే అన్నారు. కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం హర్షణీయమని ఆయన సంతోష వ్యక్తం చేశారు. ఆయనతో పాటు రోమాల రాజు తదితరులు ఉన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఆగస్టు 27 : వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వదంతులు నమ్మవద్దన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వినాయక మండపాల నిర్వహణకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 9 రోజుల పాటు పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వేడుకలు జరుపుకొనేలా భద్రతా చర్యలు చేపడుతామన్నారు. ఇందుకు అందరూ సహకరించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణగౌడ్, వంజరి రాజు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లల్లో వరుస దొంగతనాలు

విద్యుత్ మీటర్లను ధ్వంసం చేసి విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లిన దొంగలు

రామాయంపేట, ఆగస్టు 27 : పట్టణ శివారులో ఉన్న కేసీఆర్ కాలనీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లల్లో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున దొంగలు ఖాళీగా ఉన్న డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల నుంచి విద్యుత్ మీటర్లు, స్విచ్‌లు, విద్యుత్ కేబుల్, ప్లాస్టిక్ పైపులు, నల్లాలు తదితర వాటిని ఎత్తకెళ్లారు. రాత్రి కాగానే ఖాళీగా ఉన్న ఇండ్లలోకి వెళ్లి మద్యం తాగడం, తదితర వికృత చేష్టలకు పాల్పడుతున్నారు. గత ఏడాదిన్నర కాలంగా కాలనీలో ఉన్న సీసకమ్మరి వారు ఈ దురాగాతానికి పాల్పడుతున్నారని కాలనీ వాసులు తెలిపారు. గతంలో వారు ఇనుప కిటికీలను దొంగిలించి విక్రయిస్తుండగా కాలనీవాసులు పట్టుకొని స్థానిక పోలీసులకు పట్టించారు. దొంగలను అప్పగించిన తెల్లారే వారు రోడ్లపై తిరుగుతున్నారని తెలిపారు. వారి నుంచి మా కాలనీకి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

వ్యవసాయ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి

మాట్లాడుతున్న ఏవో రాజ్‌నారాయణ

రామాయంపేట, ఆగస్టు 27 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వ్యవసాయ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని రామాయంపేట వ్యవసాయాధికారి రాజ్‌నారాయణ అన్నారు. మంగళవారం రామాయంపేట పట్టణ శివారులోని మోడల్ స్కూల్ విద్యార్థులు రామాయంపేట పట్టణంలోని రైతువేదికలో జరుగుతున్న రైతు నేస్తం సమావేశానికి హాజరయ్యారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఏవో మాట్లాడారు. ఖరీఫ్, యాసంగిలో వేసే పంటలపై అవగాహన కల్పించారు. రైతు నేస్తంలో భాగంగా రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటల దిగుబడిపై వీడియో కాన్ఫరెన్స్‌లో అవగాహన కలిగించారు. కార్యక్రమంలో విస్తీర్ణ అధికారులు, మోడల్ స్కూల్ టీచర్లు సోనియా, సునీత పాల్గొన్నారు.

కామారెడ్డి నుంచి కొమురవెల్లి వరకు బస్సు సౌకర్యం కల్పించాలి

ఆర్టీసీ డీఎంకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎంపీపీ సిద్ధిరాములు

నిజాంపేట, ఆగస్టు 27 : కామారెడ్డి నుంచి కొమురవెల్లి వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే రోహిత్‌రావు అందజేసిన వినతిపత్రాన్ని మంగళవారం ఆర్టీసీ కామారెడ్డి డిపో మేనేజర్‌కు అందజేసినట్లు మాజీ ఎంపీపీ సిద్ధిరాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం కామారెడ్డి నుంచి వయా దోమకొండ, బీబీ పేట, తుజాల్‌పూర్, నస్కల్, నిజాంపేట, సిద్దిపేట, కొమురవెల్లి వరకు బస్సు సౌకర్యం కల్పించాలని డీఎంను కోరగా... సానుకూలంగా స్పందించారని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నస్కల్ గ్రామస్తులు వెంకటేశ్, రవి, మహేశ్ తదితరులు ఉన్నారు.

కూలీ పనికి వెళ్లిన మహిళ మృతి

శివ్వంపేట, ఆగస్టు 27 : కూలీ పనికి వెళ్లి ఓ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని బిజిలీపూర్ గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నెల్లురు పోచమ్మ (60) గ్రామంలో కూలీ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలింది. వెంటనే పలువురు ఆమెను నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు 108లో తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు.

పాఠశాలకు ఎల్ఈడీ టీవీ బహూకరణ

ఎల్ఈడీ టీవీని బహూకరిస్తున్న న్యూలాండ్స్ పరిశ్రమ ప్రతినిధులు

శివ్వంపేట, ఆగస్టు 27 : మండల పరిధిలోని గూడురులో ఉన్న ప్రాథమిక పాఠశాలకు బొంతపల్లి న్యూలాండ్స్ ల్యాబ్స్ పరిశ్రమ ప్రతినిధులు డిజిటల్ క్లాసుల బోధన నిమిత్తం ఎల్ఈడీ టీవీని ఎంఈవో బుచ్చానాయక్ సమక్షంలో బహూకరించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం మాధవి విద్యార్థులు, ఉపాధ్యాయుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యూలాండ్స్ పరిశ్రమ జనరల్ మేనేజర్ రవి, హెచ్ఆర్ ప్రసాద్, శ్రీధర్‌రావు, ఉపాధ్యాయులు రేణుక, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ వినియోగంపై రైతులకు అవగాహన

మాట్లాడుతున్న డాక్టర్ రమాదేవి

కౌడిపల్లి, ఆగస్టు 27 : సోలార్ వినియోగంపై డాక్టర్ రమాదేవి రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో నేషనల్ స్కిల్ ఫౌండేషన్, అగ్రిక ల్చర్ స్కిల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయానికి సోలార్‌ను వినియోగిస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. అదనపు ఆదాయాన్ని ఆర్జించడానికి పవర్ గ్రిడ్‌కు విద్యుత్ సరఫరా చేయడంతో ఆర్థికంగా మెరుగుపర్చవచ్చన్నారు. సోలార్‌కు ఎంపిక ప్రమాణాలు, అవసరమైన భూమి, పెట్టుబడి తదితర వివరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఉదయ్‌కుమార్, శ్రీకాంత్, ప్రతాప్‌రెడ్డి, నిజాంపేట, తొగిట రైతులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రామాయంపేట, ఆగస్టు 27 : మండల పరిధిలోని కాట్రియాల గిరిజన తండాకు చెందిన లక్ష్మణ్‌నాయక్ (70) అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు భిక్షపతి, శామిరెడ్డి, శ్రీశైలంరెడ్డి, సాయిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట, ఆగస్టు 27 : మండల పరిధిలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల మృతి చెందిన పిల్లుట్ల గ్రామంలో మొనగారి మల్లేశం, చండి గ్రామంలో మృతిచెందిన ఉప్పరి బాలయ్య, అర్జన్ భూపాల్ కుటుంబాలకు రూ. 5వేల చొప్పున మొత్తం రూ.15వేల ఆర్థికసాయం అందజేసి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, బలవంత్‌రెడ్డి, నారాగౌడ్ పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలి

మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

నర్సాపూర్, ఆగస్టు 27 : 2025కు సంబంధించి ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. నర్సాపూర్‌లోని రైతు వేదికలో మంగళవారం బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు ఇంటింటి సర్వే నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏమైనా సమస్యలు ఎదురైతే నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, సిబ్బంది ఉన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని ఆందోళన

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

చేగుంట, ఆగస్టు 27 : డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పలువురు మహిళలు తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా మహిళా అధ్యక్షురాలు బాలమణి మాట్లాడుతూ.. నమ్మి ఓటు వేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

పెంచిన ఇంటి పన్నులను రద్దుచేయాలి

మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్ గౌడ్

తూప్రాన్, ఆగస్టు 27 : మున్సిపల్ పాలక వర్గంలో ఎలాంటి చర్చ లేకుండా ఏకపక్షంగా పెంచిన పన్నులను వెంటనే రద్దు చేయాలని మాజీ మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఇటీవల తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని ఇండ్లకు ఇంటి పన్నులను దాదాపు పది రెట్లకు అటు ఇటుగా పెంచి ఇండ్ల యజమానులకు నోటీసులు పంపించారు. పెంచిన పన్నులపై మాజీ చైర్మన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి పట్టణంలోని బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం నుంచి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తూప్రాన్ మున్సి పాలిటీ పరిధిలోని గృహ, వాణిజ్య, వ్యాపార సముదాయాలకు అడ్డగోలుగా పెంచిన పన్నులను వెంటనే రద్దు చేయాలన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

చేగుంట ఎస్సైగా చైతన్యకుమార్‌రెడ్డి

చేగుంట, ఆగస్టు 27 : చేగుంట ఎస్సైగా చైతన్యకుమార్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై బాల్‌రాజు రామాయంపేటకు బదిలీపై వెళ్లారు. లింగంపేటలో పనిచేసిన చైతన్యకుమార్‌రెడ్డి ఇక్కడికి వచ్చారు.

పంట రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ



మాట్లాడుతున్న డాక్టర్ రమాదేవి

కౌడిపల్లి, ఆగస్టు 27 : పంట రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ మంగళవారం కౌడిపల్లిలోని రైతువేదికలో గ్రీవెన్స్‌లో ఏడీఏ పుణ్యావతి స్వీకరించారు. రుణమాఫీ కాని రైతులకు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం రైతునేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఆయా పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏవో స్వప్నాజాదవ్, ఏటీఏం నరేందర్, బీటీఏం గౌతమి పాల్గొన్నారు.

రేపు ఉద్యోగులకు క్రీడా పోటీలు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 27 : హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని యువజన క్రీడల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 29న ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని ఆ శాఖ జిల్లా అధికారి దామోదర్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ అవుట్‌డోర్ స్టేడియం, పీఎన్ఆర్ ఇండోర్ స్టేడియంలో ఉద్యోగులకు పరుగు పందెం, షాట్‌పుట్, చెస్, బ్యాడ్మింటన్, మ్యూజికల్ చైర్ తదితర క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 28న పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

పుస్తెమెట్టెల పంపిణీ

కౌడిపల్లి, ఆగస్టు 27 : డిపల్లికి చెందిన మంగళి రుక్మిణీలక్ష్మణ్ దంపతుల కూతురు స్వప్న వివాహానికి మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి పుస్తెమెట్టెలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాఖేశ్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్య అశోక్, మండల కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

అజ్జమర్రిలో ఉచిత వైద్య శిబిరం

పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిలిపిచెడ్, ఆగస్టు 27 : హైదరాబాద్‌లోని మమత దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం మండల పరిధిలోని అజ్జమర్రిలో ఈ శిబిరాన్ని మాజీ సర్పంచ్ పరశురాంరెడ్డి ప్రారంభించారు. అనంతరం వైద్యులు గ్రామస్తులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో 60 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

ఉపాధ్యాయులను సన్మానించిన ఎంఈవో తదితరులు

అల్లాదుర్గం, ఆగస్టు 27 : ఉద్యోగుల బదిలీలు సహజమని ఎంఈవో నీలకంఠం అన్నారు. మంగళవారం టెక్మాల్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి వారిని సన్మానించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులకు ప్యాడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టెక్మాల్ మాజీ సర్పంచ్ నాయికోటి సుప్రజ, హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులు మునీరొద్దీన్, అన్సారీ, అమీరొద్దీన్, విశ్రాంత ఉపాధ్యాయులు శంకర్ రావు, రాందాస్, వెంకటేశం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మహంకాళి ఆలయ వార్షికోత్సవాలు

చేగుంట, ఆగస్టు 27 : మండల కేంద్రంలోని మహంకాళి ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 29 నుంచి వచ్చే నెల 2 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, పురోహితులు వాసుదేవ శర్మ, రాఘవేంద్ర శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

పెద్దశంకరంపేట, ఆగస్టు 27 : స్థానిక ఎంపీపీ కార్యాలయంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మంగళవారం 25 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రేసీ బాయి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయిని మధు, నాయకులు నారాగౌడ్, దాచ సంగమేశ్వర్, అలుగుల సత్యనారాయణ, ఆర్ఎన్ సంతోశ్‌కుమార్, బాసాడ రాజు, సుబాశ్‌గౌడ్, కుంట్ల రాములు, ప్రతాప్గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పొలం వద్ద పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య

మృతుడు రాజయ్య

చిలిపిచెడ్, ఆగస్టు 27 : పొలం వద్ద పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. చండి గ్రామానికి చెందిన శివన్నగారి భూపాల్ (37) కొంత కాలంగా మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులతో తరుచూ ఇంట్లో గొడవ పడుతుండేవాడు. ఈ నెల 26న రాత్రి మద్యం తాగి ఇంట్లో దూలానికి ఉరివేసుకొన్నాడు. మృతుడి భార్య సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

శ